క్లుప్తంగా

శీత్లా భవానికి బోనాలు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): లంబాడీపేటలోని శ్రీముత్యాలమ్మ, శ్రీకనకదుర్గ దేవస్థానంలో మంగళవారం శీత్లా భవాని బోనాల పండుగను వైభవంగా నిర్వహించారు. శీత్లా భవానీ బోనాల పండుగకు ముఖ్య అతిథులుగా మేయర్ రాయన భాగ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి దయతో రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని కోరుతూ పూజలు నిర్వహించినట్లు భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవత్ మురళీనాయక్, రవీంద్రనాయక్, లంబాడీపేట కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నిధుల కేటాయింపులో సీఎం చంద్రబాబు విఫలం

వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఏపీకి నిధులు కేటాయింపు చేయించుకోవడంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఘోరంగా విఫలమయ్యారని వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ మంగళవారం తెలిపారు. కేవలం రాజధాని నిర్మాణానికి రూ.15 వేల కోట్ల తప్పా మిగిలిన అంశాల్లో ఎక్కడా స్పష్టత లేదన్నారు. అందులోనూ వివిధ సంస్థల ద్వారా అప్పు అని స్పష్టంగా కేంద్రం తెలిపిందన్నారు. కేంద్రంలో చక్రం తిప్పుతున్నామంటూ ప్రగల్భాలు పలుకుతున్న కూటమి నేతలు ప్రత్యేకంగా నిధులు తీసుకొచ్చేందుకు ఒత్తిడి పెట్టలేకపోయారని తెలిపారు. నితీష్‌కుమార్ ఒత్తిడితో బిహార్ రాష్ట్రానికి భారీగా నిధులు కేటాయించిన కేంద్రం అదే రీతిలో చంద్రబాబు ఏపీకి కావాల్సిన నిధులను తీసుకురావటంలో విఫలమయ్యారని చెప్పారు. ప్రత్యేక హోదా లేనట్లుగా ప్రత్యేక సాయం పేరుతో కేంద్రం తేల్చి చెప్పిందని ఇది పూర్తిగా చంద్రబాబు అసమర్థతే అన్నారు.

బడ్జెట్‌పై సెమినార్



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్ ఉద్యోగ వర్గాలకు ఊరటనిచ్చేవిధంగా ఉందని ప్రముఖ ఆడిటర్ లింగమూర్తి అన్నారు. కేబీఎన్ కళాశాల కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో బడ్జెట్‌పై ప్రత్యేక ప్రసంగాన్ని మంగళవారం ఆ కళాశాల సెమినార్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడిటర్లు గంగాధరరావు, లింగమూర్తి మాట్లాడుతూ ఏపీ రాజధాని నిర్మాణానికి రూ.15 వేల కోట్లు, పోలవరం నిర్మాణానికి సహకారం వంటి అంశాలు రాష్ట్రానికి ఊరటనిచ్చే అంశాలన్నారు. ముద్ర రుణాలను 10 నుంచి రూ.20 లక్షలకు పెంచటం బాగుందన్నారు. విద్య, వైద్య రంగాలకు సైతం కేటాయింపులు పర్వా లేదన్నారు. అనంతరం విద్యార్థులు అడిగిన పలు అంశాలపై ఆడిటర్లు సమాధానాలిచ్చారు.

అత్తింటి వేధింపులపై కేసు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అత్తింటి వేధింపులపై వివాహిత కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా మంగళవారం కేసు నమోదు చేశారు. వించిపేట కొప్పులూరి వీధికి చెందిన మొహమ్మద్ నజ్మాబేగంకు తెనాలికి చెందిన జున్నత్ హుస్సేన్ పవార్‌కు ఇచ్చి పెద్దలు వివాహం చేశారు. ఉద్యోగరీత్యా జున్నత్ హుస్సేన్‌పవార్ హైదరాబాద్‌కు వెళ్లగా, పటాన్ చెరువులో అద్దెకు ఉండే వారు. కొంత కాలంగా అత్త షంధల్, మామ రత్నాకర్ పవార్‌తో పాటు భర్త వేధిస్తుండటంతో బాధితురాలు పుట్టింటికి వచ్చేసింది. అత్తింటి వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): రాకేష్ పబ్లిక్ స్కూల్‌లో విద్యనభ్యసిస్తున్న పేద, సింగిల్ పేరెంట్ విద్యార్థులకు మంగళవారం స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేశారు. రాకేష్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ ఎన్వీరావు పుట్టినరోజు పురస్కరించుకుని ఏటా పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేస్తున్నారు. దీనిలో భాగంగా మంగళవారం స్కూల్ ఆవరణలో రాకేష్ సర్వీస్ సొసైటీ అధ్యక్షులు, రిటైర్డ్ సూపరింటెండెంట్ ఇంజినీర్ పొత్తూరి రాధాకృష్ణమూర్తి చేతుల మీదుగా 40 మంది పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వసతి గృహ వేదన

- ఏళ్లు గడుస్తున్నా రోటరీనగర్‌లోని ఎస్సీ బాలుర హాస్టల్‌కు కలగని మోక్షం
- అసాంఘిక శక్తులకు అడ్డాగా మారిన వైనం

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎస్సీ బాలుర హాస్టల్ మరమ్మతులకు గురైంది. పెచ్చులూడి శిథిల భవనాన్ని తలపించడంతో విద్యార్థులను వేరే చోటకు తరలించి అధికారులు చేతులు దులుపుకున్నారు. కానీ సమస్య పరిష్కరించకపోవడంతో ఇప్పటికీ అదే పరిస్థితి ఉంది. అదెక్కడ ఉందంటే విద్యాధరపురం 45వ డివిజన్ పరిధిలోని రోటరీనగర్‌లో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యాన బాలుర హాస్టల్ నడిచేది. ఇది శిథిలావస్థకు చేరడంతో నాడు టీడీపీ హయాంలో ఇక్కడి విద్యార్థులను వేరే హాస్టల్‌కు తరలించారు. తర్వాత దీని అభివృద్ధిని అధికారులు పట్టించుకోలేదు. నాటి టీడీపీ హయాంలో దీని అభివృద్ధికి పునర్నిర్మాణ పనులు చేట్టలేదు. కోట్ల రూపాయల విలువ చేసే హాస్టల్‌ను పాడుబెట్టడంతో భూత్ బంగ్లాను తలపిస్తున్న ఆ భవనం అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హాస్టల్ గేట్‌తోపాటు భవనం మెయిన్ ద్వారం తెరిచే ఉండటంతో రాత్రి, పగలు తేడా లేకుండా ఆకతాయిలు చేరి చేస్తున్న పనులతో నిద్రకూడా పట్టటం లేదని చుట్టు పక్కల నివసిస్తున్న వారు చెబుతున్నారు. హాస్టల్ భవనాన్ని అలా వదిలేస్తే కబ్జాదారుల కన్ను పడే అవకాశం లేకపోలేదని వారు వ్యాఖ్యానిస్తున్నారు.



శిథిలావస్థకు చేరుకున్న ఎస్సీ బాలుర హాస్టల్ భవనం (ఇన్‌సెట్) లోపలి భాగం

ప్రతిపాదనలేగానీ పనులు నిల్

రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాల నుంచి ఎస్సీ బాలురు ఇక్కడ హాస్టల్‌లో ఉంటూ ఇంటర్ నుంచి పీజీ వరకు చదుకునేవారు. అలాగే పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యేవారు. సుమారు పదేళ్ల క్రితం ఈ హాస్టల్‌లో దాదాపు 150 మంది విద్యార్థులు ఉండేవారు. భవనం మరమ్మతులు అని కొన్నాళ్లు, భవన పునఃనిర్మాణ పనుల కోసమని కొన్నాళ్లు విద్యార్థులను ఇతర వసతి గృహాలకు తరలించారు. హాస్టల్ భవనాన్ని తొలగించి రూ.50లక్షల వ్యయంతో ఐదు అంతస్తుల భవనం నిర్మించడానికి అప్పటి అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేశారు. ఆ భవనంలో సెల్లార్, ఫస్ట్ ఫ్లోర్‌లో కిచెన్ – డైనింగ్ హాల్, సెకండ్ ఫ్లోర్‌లో లైబ్రరీ, 3, 4, 5 అంతస్తులలో రెసిడెన్షియల్, ఐఏఎస్ అకాడమీ, అంబేడ్కర్ స్టడీ సెంటర్ ఏర్పాటు చేయాలన్నది ఆ ప్రతిపాదనలోని సారాంశం. అయితే ప్రతిపాదనలు, చర్చలు, ప్లాన్లు తంతు జరిగేసరికి పుణ్యకాలం కాస్తా గడిచిపోయింది. కేటాయించిన నిధులు కూడా వెనక్కి వెళ్లిపోయినట్లు తెలిసింది. నాటి నుంచి నేటి వరకు ఆ శిథిల భవనం మాత్రం ఆలనా పాలనా లేక అలానే పడి ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించాల్సి ఉంది.

ఎస్సీ హాస్టల్ భవనాన్ని పునర్నిర్మించాలి



ఎస్సీ బాలుర వసతి గృహాన్ని పునఃనిర్మించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులు ప్రైవేట్ హాస్టల్స్‌లోగాని లేదా రూమ్‌లు తీసుకుని చదువుకునే పరిస్థితి లేదు. గతంలో ఈ భవనాన్ని పునఃనిర్మిస్తామని చెప్పిన టీడీపీ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చింది కాబట్టి ఇప్పటికైనా ఆ దిశగా చర్యలు తీసుకోవాలి. కూటమి ప్రభుత్వం ఎస్సీ సంక్షేమ హాస్టళ్ల అభివృద్ధిపై దృష్టి సారించి విద్యార్థుల ఉన్నత చదువులకు వెళ్లేలా ప్రోత్సహించాలి.

– రవిచంద్ర, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



ఆర్‌సీఎం స్కూల్‌లో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ సత్యబాబు

వించిపేట(విజయవాడపశ్చిమ): పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమల నివారణ సాధ్యమవుతుందని 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు విద్యార్థులకు అవగాహన కల్పించారు. నగరపాలక సంస్థ ప్రజారోగ్యశాఖ ఆధ్వర్యాన గొల్లపాలెంగట్టు ఆర్‌సీఎం పాఠశాలలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. సత్యబాబు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణ చర్యలు చేపట్టే అంశంలో అందరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఖాళీ స్థలాలు, ఇళ్లలో పాడైపోయిన డబ్బాలు, పూల కుండీలు తదితర వాటిల్లో నీరు నిల్వ లేకుండా చూసి దోమలు నివారణకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్కిల్–1 శానిటరీ సూపర్‌వైజర్ ఓబేశ్వరావు, మలేరియా ఇన్‌స్పెక్టర్ రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఎం.రవికుమార్, ఆదినారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంచినీళ్లు మహాప్రభో..

- తాగునీరు అందక టైలర్‌పేట వాసుల ఇబ్బందులు
- అనేకసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



తాగునీటి ఇబ్బందులపై ఆందోళన వ్యక్తం చేస్తున్న మహిళలు

వించిపేట(విజయవాడపశ్చిమ): ఏటా ఇంటి పన్ను, నీటి పన్ను అంటు ఠంచన్‌గా మా నుంచి వసూళ్లు చేస్తున్న నగరపాలకసంస్థ అధికారులు సక్రమంగా తాగునీటిని అందించకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ 49వ డివిజన్ టైలర్‌పేట నివాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏనుగుల అంజయ్యవీధి, కొడ్రువారివీధిలో సుమారు 50 కుటుంబాల నివాసితులకు రెండేళ్లుగా తాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై అనేకసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవంటా స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాడుకోవడానికి కాదు కదా కనీసం తాగడానికి కూడా నీళ్లు లేక ఇతర ప్రాంతాల నుంచి తెచ్చుకోవాల్సిన దుర్భర పరిస్థితి నెలకొందన్నారు. మా ప్రాంతంలో కనీసం బోరు పంపులు, పబ్లిక్ కుళాయిలు కూడ లేకపోవడంతో పరిస్థితి మరింత దారుణంగా ఉంటోందని వాపోతున్నారు. గతంలో ఈ ప్రాంతంలో ఓడీఏ(ఓవర్సీస్ డెవలప్‌మెంట్ అథారిటీ) పైప్‌లైన్‌లు ఉండటంతో తమకు ఎటువంటి నీటి కష్టాలు రాలేదన్నారు. అయితే తమ ప్రాంతంలో సీసీ రోడ్లు వేసే క్రమంలో అడ్డుగా ఉన్నాయనే నెపంతో ఓడీఏ పైప్‌లైన్‌ను అధికారులు తొలగించారన్నారు. తాత్కాలికంగా స్థానికులకు ఇతర ప్రాంతంలోని పైప్‌లైన్లకు కలిపారు. వీటి ద్వారా చుక్కనీరు కూడా అందడం లేదంటున్నారు. అప్పుడప్పుడు సన్నని ధారతో అరగంట మాత్రమే వచ్చేదని, ప్రస్తుతం అది కూడా రాకపోవడంతో తామంతా మంచినీళ్లు.. మహా ప్రభో అంటూ బిందెలు పట్టుకుని ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సివస్తుందని వాపోతున్నారు.

కృష్ణా నది పక్కనే ఉన్నా అందని తాగునీరు



కృష్ణా నది పక్కనే ఉన్నా తాగునీరు అందకపోడం బాధాకరంగా ఉంది. ఉదయం పిల్లలు స్కూళ్లకు వెళ్లే క్రమంలో నీటి సరఫరా లేక పిల్లలతో కలసి తామంతా ఇతర ప్రాంతాల నుంచి బిందెలతో మోసుకోవాల్సిన దుర్భర పరిస్థితి నెలకొంది. దీనిపై స్థానిక ఏఈకి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఉపయోగం లేదు. సంబంధిత అధికారులు దృష్టి సారించి నీటి కష్టాలు తొలగించాలి

– బైరం మాధవీలత, ఏనుగుల అంజయ్యవీధి

తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం



వీఎంసీ అధికారులకు నీటి పన్ను వసూళ్లపై ఉన్న శ్రద్ధ సక్రమంగా తాగునీరు అందించడంలో లేకపోవడం దురదృష్టకరం. తాగునీరు, వాడుకకు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. గతంలో ఇచ్చినట్లుగా తమకు ఓడీఏ లైన్‌ల ద్వారా తాగునీటిని అందిస్తే సమస్య తొలగిపోయేది. అధికారులు మా ప్రాంతంలో పర్యటించి సమస్యను అర్థం చేసుకుని పరిష్కరించాలి.

– బాయన గోవిందమ్మ, టైలర్‌పేట

పారిశ్రామిక రంగానికి కేంద్రం పెద్ద పీట



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎస్‌ఎంఈ గౌరవ అధ్యక్షుడు బాయన వెంకట్రావు

ఆటోనగర్(విజయవాడతూర్పు): కేంద్ర మంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ పారిశ్రామిక రంగానికి పెద్దపీట వేసిందని, పరిశ్రమల బలోపేతానికి అనుకూలంగా ఉందని ఏపీ ఎంఎస్‌ఎంఈ గౌరవ అధ్యక్షుడు బాయన వెంకట్రావు అన్నారు. ఆటోనగర్‌లోని ఎంఎస్‌ఎంఈ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రొజెక్టర్ ద్వారా కేంద్ర మంత్రి నిర్మలాసీతారామన్ బడ్జెట్ ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏపీఎంఎస్‌ఈ అధ్యక్షుడు దుర్గాప్రసాద్‌తో పాటు పలువురు మాట్లాడుతూ ఏపీలో పరిశ్రమల ఏర్పాటుకు కేంద్రప్రభుత్వం కృషి చేయనున్నట్లు చెప్పారు. ముద్ర రుణాలు రూ.10 నుంచి 20 లక్షలకు పెంచుతున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి పేర్కొనడం హర్షనీయమన్నారు. కొత్తగా 12 పారిశ్రామిక కారిడార్లు, కార్మికులకు డార్మెటరీ తరహా అద్దె ఇళ్ల నిర్మాణాలు చేస్తామని చెప్పడం మంచి పరిణామమన్నారు. మౌలిక వసతులకు రూ.11.11 లక్షల కోట్లు ఇవ్వడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఎంఎస్ రామచంద్రారావు, కార్యదర్శి జమ్ముల ప్రసాద్ పాల్గొన్నారు.

అసెంబ్లీకి ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల విద్యార్థులు



అసెంబ్లీ వద్ద కళాశాల విద్యార్థులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి మంగళవారం వందమంది ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు అమరావతిలో అసెంబ్లీ సమావేశాలను వీక్షించడానికి వెళ్లారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యలక్ష్మి తెలిపారు. ఆమె మంగళవారం వివరాలు వెల్లడించారు. తమ కళాశాల విద్యార్థులకు అసెంబ్లీ సమావేశాలను వీక్షించడానికి అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబుకు, విద్యాశాఖమంత్రి నారా లోకేష్‌కు ధన్యవాదాలు తెలిపారు. పుస్తకాల్లో థియరీ చదవడం వరకే కాకుండా ప్రాక్టికల్‌గా సమావేశాలు ఎలా జరుగుతాయో ప్రత్యక్షంగా విద్యార్థులు వీక్షించారన్నారు. ఇలాంటి అవకాశాన్ని కల్పించిన కళాశాల కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ఎన్టీఆర్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ యుగంధర్, మహిళా సాధికారిత సెల్ కన్వీనర్ డాక్టర్ కె.అరుణ, సిబ్బంది ప్రశాంతి, ఉమామహేశ్వరి ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

నగరంలో ‘అలనాటి రామచంద్రుడు’ సందడి



అలనాటి రామచంద్రుడు చిత్ర యూనిట్

లబ్బీపేట(విజయవాడతూర్పు): అద్భుతమైన ప్రేమ కావ్యం అలనాటి రామచంద్రుడు చిత్రాన్ని ఆగస్టు 2న ప్రేక్షకుల ముందుకు తీసుకురాన్నామని, ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులు వీక్షించి ఆదరించాలని చిత్ర కథానాయకుడు కృష్ణవంశీ కోరారు. ఎంజీరోడ్డులోని ఒక హోటల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగులో తాను అలనాటి రామచంద్రుడు చిత్రంతో హీరోగా పరిచయం అవుతున్నట్లు తెలిపారు. దర్శకుడు ఆకాష్ చిత్రాన్ని ఒక అద్భుతమైన ప్రేమ కావ్యంగా మలిచారని తెలిపారు. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించడం సంతోషంగా ఉందన్నారు. ప్రముఖ నిర్మాత దిల్ రాజ్ తమ చిత్రాన్ని రిలీజ్ చేయడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. హీరోయిన్ మోక్ష మాట్లాడుతూ సీత ప్రేమను దక్కించుకునేందుకు రాముడు పడిన కష్టాలను అలనాటి రామచంద్రుడు చిత్రంలో దర్శకుడు ప్రేక్షకులకు సరికొత్త రీతిలో చూపించనున్నారని పేర్కొన్నారు. దర్శకుడు ఆకాష్ మాట్లాడుతూ గ్రామీణ వాతావరణంలో తీసిన సన్నివేశాలు ప్రేక్షకులకు నచ్చుతాయని చెప్పారు. సమావేశంలో నటులు దివ్యశ్రీ, స్నేహ పాల్గొన్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన మహిళపై కేసు

పాయకాపురం(విజయవాడరూరల్): కార్పొరేషన్లో స్వీపర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని డబ్బులు తీసుకొని మోసం చేసిన మహిళపై వచ్చిన ఫిర్యాదుతో మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పాయకాపురం రాధానగర్‌కు చెందిన వడ్డిపల్లి సామ్రాజ్యం అనే మహిళ పాతరాజీవ్‌నగర్ వడ్డెర కాలనీకి చెందిన ఉప్పల ధనమ్మ, 12 మందికి ఔట్ సోర్సింగ్ శానిటరీ స్వీపర్స్ ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పింది. ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.40 వేలు తీసుకున్నట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. 13 మందితో ఒక నెల స్వీపర్ పనులు చేయించి తొలగించారు. ఉద్యోగంపై గట్టిగా అడగ్గా సామ్రాజ్యం రూ.1.40 లక్షలు తిరిగి ఇచ్చింది. ఇంకా రూ.3.80 లక్షలు తిరిగి ఇవ్వకుండా, స్వీపర్ ఉద్యోగాలు ఏర్పాటు చేయకుండా మోసం చేసినట్టు వచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

అటకెక్కిన పారిశుద్ధ్యం

రామవరప్పాడు: నగరానికి అతి సమీపంలో ఉన్న మేజర్ పంచాయతీ రామవరప్పాడులో పారిశుద్ధ్య సమస్య పట్టి పీడిస్తోంది. గ్రామంలో సుమారు 50 వేలకు పైగా జనాభా నివసిస్తున్నారు. ఇంతటి ప్రాధాన్యత సంతరించుకున్న ఈ గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ లోపంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులు నిర్వహించడానికి సుమారు 90 మంది పారిశుద్ధ్య సిబ్బంది ఉన్నారు. వీరిని గ్రామంలో పారిశుద్ధ్య పనులు నిర్వహించే కంటే పంచాయతీ పెద్దలు వ్యక్తిగత అవసరాలకు వినియోగించుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామంలో ప్రధాన రహదారితో పాటు అంతర్గత రహదారుల్లో నిత్యం చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా రాజుల బజారు, బల్లెంవారి వీధి, కొట్టివారి వీధి, అంకిత అపార్టుమెంట్ ఏరియా, కాల్వగట్టు ప్రాంతాల్లో రహదారుల వెంబడే చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. ఫలితంగా ఆయా ప్రాంతాల్లోని వాసులకు నిత్యం అవస్థలు తప్పడం లేదు. పారిశుద్ధ్య నిర్వహణ కూడా అభివృద్ధి చెందిన ప్రాంతాల వరకే పరిమితం చేస్తున్నారే తప్ప లోపలి ప్రాంతాల్లో పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. గ్రామంలోని చెత్తనంతటినీ తీసుకొచ్చి బల్లెంవారి వీధిలోని ఎస్సీ శ్మశానంలో డంప్ చేస్తుండటంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ శ్మశానం ప్రధాన రహదారికి ఆనుకుని ఉండటం, దీని పరిసర ప్రాంతాల్లో నివాసాలు ఉండటంతో ఈ ప్రాంతవాసులు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. శ్మశానం చుట్టూ చెత్త గుట్టలుగా పేరుకుపోయాయి. ఫలితంగా పందులు, కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. దోమలు వృద్ధి చెందుతున్నాయని సమీప ప్రాంతప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

పాతబస్తీలో పార్కింగ్ దందా!

- టెండర్లు లేవు, అనుమతి లేదు
- అధికార పార్టీల నేతలు అడ్డగోలు దోపిడీ
- స్థానిక ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ అండతో దందా!



అక్రమంగా వసూళ్లు చేస్తున్న దృశ్యం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలో అధికార పార్టీకి చెందిన నేతలు పార్కింగ్ దందాలకు పాల్పడుతున్నారు. అధికారం చేపట్టి ఎక్కువ రోజులు గడవక ముందే అడ్డగోలుగా దోపిడీకి పాల్పడుతున్నారు. పార్టీలు వేరైనా ఎన్నికల్లో కలిసి కట్టుగా పని చేసిన నేతలు దోపిడీలోనూ కలిసే వాటాలు పంచుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే స్థానిక ఎమ్మెల్యేకు చెందిన పార్టీ నేతలతో పాటుగా స్థానిక టీడీపీ నేతలు పాతబస్తీలోని పార్కింగ్‌లపై కన్నేశారు. వారికి వీఎంసీ అధికారుల చేయూత తోడవ్వటంతో వారి దోపిడీ మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతోంది.

రెండు పార్కింగ్‌ల ఆక్రమణ

పాతబస్తీలోని రెండు ప్రధానమైన పార్కింగ్ ప్రాంతాలను టీడీపీ, బీజేపీ నేతలు ఆక్రమించారు. తాము ఎమ్మెల్యే తాలుకా, మాజీ ఎమ్మెల్సీ కుటుంబ సభ్యుల తాలుకా అని పార్కింగ్‌లను ఆక్రమించారని స్థానిక వ్యాపారులు చెబుతున్నారు. పాతబస్తీ కెనాల్‌రోడ్డులో వినాయకునిగుడి నుంచి రథం సెంటర్ బొడ్డు బొమ్మ వరకూ వీఎంసీ పార్కింగ్‌కు టెండర్లు పిలిచింది. అది జూన్ 26వ తేదీన ముగిసింది. మరుసటి రోజు నుంచి నగరపాలక సంస్థ సిబ్బంది పార్కింగ్ నిర్వహణ చేశారు. దానిపై కన్నేసిన అధికార పార్టీ నేతలు వీఎంసీ సిబ్బందిని అక్కడి నుంచి తరిమేసి వారే వసూళ్లకు దిగారు. అక్కడ దుర్గగుడికి చెందిన కాంట్రాక్టర్ వసూళ్లకు పాల్పడుతున్నారు. అధికార పార్టీకి చెందిన నేతల వత్తాసుతో వసూళ్లను కొనసాగిస్తున్నారని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. గడువు ముగిసినా వీఎంసీ ఎటువంటి టెండర్లు పిలవలేదు. కనీసం ఎవరికీ అనుమతి సైతం ఇవ్వలేదు.

ఇరిగేషన్ స్థలంలోనూ అదే దోపిడీ

నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం సమీపంలో సీతమ్మవారి పాదాల వద్ద ఇరిగేషన్ విభాగానికి చెందిన స్థలం ఉంది. దానిలో దసరా, భవానీ దీక్షల విరమణ ఉత్సవాల్లో దుర్గమ్మ దర్శనానికి వచ్చిన భక్తుల కోసం సదుపాయాలను ఏర్పాటు చేస్తుంటారు. దీని నిర్వహణ వీఎంసీ సిబ్బంది చూస్తుంటారు. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే స్థానిక టీడీపీ, బీజేపీ నేతల ప్రోత్సాహంతో కొన్ని రోజుల నుంచి అక్రమంగా పార్కింగ్ రుసుం వసూళ్లకు దిగారు. దీనికి సైతం టెండర్లు పిలవలేదు.

కోర్టులో ఉన్నా తగ్గని నేతలు

వినాయకుని గుడి నుంచి రథం సెంటర్ వరకూ ఉన్న పార్కింగ్‌కు సంబంధించి ఒకరు కోర్టుకు ఎక్కారు. జూన్ వరకూ ఉన్న కాంట్రాక్టర్ చెల్లించిన దానికన్నా తాను అధికంగా ఇస్తానని కోర్టులో కేసు వేశారు. దానిపై విచారణ కొనసాగుతోంది. అంతలోనే కూటమికి చెందిన నేతలు ఇలాంటి దోపిడీకి పాల్పడుతున్నారు. వీఎంసీ, ఇరిగేషన్ శాఖల ఆధ్వర్యంలో ఉన్న పార్కింగ్‌లను దుర్గగుడి కిందకు తీసుకొచ్చి వాటిని తమ పరిధిలోకి తీసుకోవాలని స్థానిక కూటమి నేతలు కుట్రలు చేస్తున్నారని నగరపాలక సంస్థకు చెందిన ఒక అధికారి వ్యాఖ్యానించారు. అంతేకాకుండా వీఎంసీ సిబ్బందిని సైతం బెదిరించి పార్కింగ్ ప్రదేశాన్ని తీసుకున్నారని వారు చెబుతున్నారు. అందులో భాగంగానే ఎటువంటి టెండర్లు లేకుండా ఇలాంటి దందాకు పాల్పడుతున్నారని తెలిసింది. దీనిపై కొత్తగా వచ్చిన కమిషనర్ దృష్టి సారించాల్సి ఉంది.

వాహన్ పోర్టల్ ఇబ్బందులు పరిష్కరించండి

లబ్బీపేట(విజయవాడతూర్పు): కేంద్ర ప్రభుత్వం ఆన్‌లైన్ సేవల కోసం తీసుకొచ్చిన వాహన్ పోర్టల్ వల్ల యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆంధ్రప్రదేశ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వైవీ ఈశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమస్యను పరిష్కరించాలని కేంద్ర రవాణాశాఖా మంత్రి నితిన్ గడ్కరీకి లేఖ పంపినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పోర్టల్ ఈ– ప్రగతి స్థానంలో వాహన్ పోర్టల్ ఈ నెల 8 నుంచి ప్రయోగాత్మకంగా ఎన్టీఆర్ జిల్లాలో అమలు చేసే క్రమంలో వాహనదారుల డేటా కేంద్ర పోర్టల్ వాహన్ లోకి బదలాయింపు కావడం లేదన్నారు. వాహన్ పోర్టల్‌లో అన్ని రాష్ట్రాల వాహనాల డేటా ఇంకా అప్‌లోడ్ కాలేదని, కొన్ని రాష్ట్రాలు పొరుగు రాష్ట్ర వాహనాల నంబరు ప్లేట్లపై డిజిటల్ చలాన్‌లు జారీ చేస్తున్నాయని తెలిపారు. ఆ వివరాలు ఆయా రాష్ట్రాల వెబ్‌సైట్‌లలో మాత్రమే అందుబాటులో ఉంటున్నట్లు చెప్పారు. దీంతో వాహన యజమానులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అన్ని రాష్ట్రాల వాహనాల డేటా వాహన్ పోర్టల్ నూరుశాతం అప్‌లోడ్ చేసే వరకూ డిజిటల్ చలానాలు విధించకుండా సర్క్యులర్ జారీ చేయాలని కోరారు.